

# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్ తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

*(గత సంచిక తరువాయి)*

**ఈ వార్డులో** మూడు వారాలుండడం నాకు దుస్సాధ్యంగా తోచింది. వేగం వెళ్ళిపోయే మార్గం ఆలోచిస్తున్నా. మరేం పరవాలేదన్నాడు మూర్తి. పది రోజుల్లో విడుదల చేస్తానన్నాడు. ఆరు వారాలు మెడికల్ లీవు కూడా యిప్పిస్తానన్నాడు.

ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలకి రాయ్ (కాదు, కరీమ్) వచ్చాడు. ఇద్దరం మరీజ్ బజారు వెంపు షికారు వెళ్ళాం. బజారు నానుకుని ఒక చర్చి వుంది. అందులో ఒక చక్కని తోట వుంది. అటెవ్వరూ రారు. ప్రశాంతంగా వుంటుంది.

ఆ తోటలో ఒక మూల క్రోటన్సు మొక్కల కింద కూచున్నాం. కరీమ్ టోపీ తీసి పక్కన పెట్టాడు.

"మిష్టర్ రావ్! నన్ను చూస్తే అసహ్యం వేస్తుంది కదూ?"

"లేదు. ఆశ్చర్యం వేస్తుంది. ఆందోళన కలుగుతూంది. మొదట మనం పద్మానది మీద కలిశాం. త్వరలో మీరు పద్మా వివాహం చేసుకుని సుఖంగా వుంటారని అనుకొన్నా. మళ్ళా కలుస్తామో కలవమో అని విచారించా. కాని మళ్ళీ మనిద్దరం కలిశాం అగర్తలాలో. మీ ఆశ్రమం మారిపోయింది. నాకు చాలా బాధ కలిగింది. తిరిగి కలవమేమో అనుకొన్నా. కాని యిక్కడ కలిశాం. మీ మతమే మారిపోయింది. ఎంచేత?"

ఇద్దరం సిగరెట్లు ముట్టించాం. అతను శంఖం వూదినట్టు దమ్ము లాగి పొగ ఒదిలాడు.

"మతం మారలేదు. ఏం మారలేదు స్థలం మారా, అంతే."

"మళ్ళీ ఏం ప్రమాదం జరిగింది?" –

"చెప్తా... అంతా చెప్తా... సావకాశంగా చెప్తా" అతను తిరిగి ఘాటుగా దమ్ములాగాడు.

"అగర్తలా రేషను స్టాండు ఎంతుండేదో మీరు చూశారు కదా. ఆ స్టాండు అంతా నా గుప్పిటిలో వుండేది. నా సీటు అలాంటిది. కాయితాల పనంతా నాదగ్గిర కొచ్చేవరకే. రేషన్లు యివ్వడం నాయిష్టం."

"ఇది చాలా ఆశ్చర్యంగా తోస్తుంది. కాని నిజం. కారణం ఆ గోడౌన్లలో వున్న సరుకు లెక్క పెట్టడం మానవ మాత్రుడి తరం కాదు. రేషను సప్లైలు నిత్యం సముద్రం పొంగినట్టు వస్తూ పోతుంటాయి. అయితే నన్నెవరూ అనుమానించకుండా వుండాలికదా?"

నావేపు చూసి తిరిగి దమ్ములాగాడు. చిన్నగాలేసి చెట్ల ఆకులు కదలేయి. వెంటనే టోపీ తీసి పెట్టుకుని అటూ యిటూ చూశాడు.

"ఎవ్వరూ లేరు, గాలి" అన్నాను.

అతను తిరిగి అటు యిటూ చూసి టోపీ తీసి పక్కని పెట్టాడు.

“మనం ఈ టోపీతోటే ప్రస్తుతం లోకానికి టోపీలేస్తున్నాం.”

దొంగ నవ్వు నవ్వుతూ అన్నాడు.

"అసలీ అనవసరమైన సాహసాలెందుకు. యిలా యిబ్బందిలో పడ్డమెందుకు...” అన్నాను.

“తుక్కూ తుక్కూ.. మీరంటూన్నది. మీకే అర్ధం కాదు. సాహసం లేకపోతే జీవితం చప్పగా వుంటుంది. సరే. నన్నెవ్వరూ అనుమానించకూడదు కదా. అడిగిన వాళ్ళందరికీ లేదనకుండా యిచ్చా. పెద్ద పెద్ద ఆఫీసర్లు నా అభిమానం కోసం పాకులాడేవారు. ఇక కింది వాళ్ళ సంగతి చెప్పాలా? నాచుట్టూ తిరిగేవారు.

నేనెప్పుడూ స్టాండు విడిచి పెట్టేవాణ్ని కాదు. ఫిష్ పూల్ హత్య తరవాత ఏదో పోలీసు కేసు జరిగేవుంటుంది. నన్ను పట్టుకోడానికి ఎర్ర టోపీలు ప్రయత్నిస్తూండొచ్చు. వాళ్ళు అమ్మనేమీ చికాకు చెయ్యలేరు. ఇక నా జాగ్రత్తలో నేనుండాలనుకున్నా. రాత్రి పదయ్యేక ఒంటరిగానో, మరొక స్నేహితుడితోనో చుట్టుపక్కల షికారు తిరిగే వాణ్ని.

అగర్తలాలో ఆకలి పిశాచం యెలా తాండవిస్తూందో మీకు తెలుసు. ఎటు చూసినా పీనుగులు, నడపీనుగులు.

రాత్రిళ్ళు సిపాయిలు చుట్టు పక్కల పల్లెల మీద విరుచుకుపడుతున్నారు, ఆ పల్లె ప్రజలసలే అమాయకులు, దానికి తోడు పేదరికంతో విలవిల్లాడిపోతున్నారు. చీకటిలో నిశ్శబ్దంగా నిద్రపోతూన్న పల్లెలలో హటాత్తుగా కీచులాటలు, గుద్దులాటలు, పరుగులు, హాహాకారాలు, ఏడుపులు, బొబ్బలు, గృహదహనాలు ఎన్నో రాత్రిళ్ళు స్వయంగా చూశా. నా గుండెల్లో చిచ్చు రేగింది.

పద్మ కోసం విషప్పురుగులాంటి ఫిష్ పూల్ ని చంపా. ఆ కారణంగా అజ్ఞాతవాసినై పోయా. ఇక్కడ అంతకంటే ఘోరదృశ్యాలు చూస్తున్నా. పద్మ వ్యక్తి కాదు. భారతదేశమే, పరిపాలకులీ యుద్ధాన్ని మనమీద బలవంతంగా రుద్దారు. దేశాన్ని కౌరవసభచేసి, దేశమాత వస్త్రాపహరణం చేస్తున్నారు. మనమంతా పనికిమాలిన దద్దమ్మ పాండవుల్లా చూస్తూ వూరుకొన్నాం.

ఈ యుద్ధం ఆపగలనా? నా తరంకాదు. ఈ జులుం నివారించగలనా? నా వశంగాదు, ఏం చెయ్యగలను? ఏం చెయ్యగలను? ఆలోచించి నిర్ణయానికొచ్చా...” అంటూ ఒక ఉదంతం చెప్పేడు. ఒకనాడు తన స్థావరానికి ఒక ట్రక్కు వచ్చింది.

“155 ఇ.ఇ.టి.సి?"

“జీ సాబ్!”

“ఇ.ఇ.టి.సి. అంటే?”

"ఇంజలీర్ ఇక్విట్.... నోరు తిరగదు సాబ్..."

"సరే సరే... మీ యూనిట్ కొత్తగా వచ్చిందా?"

"ఔను సాబ్. ఇవాళే..."

"సరే పద"

లారీ నిండిపోయింది. బియ్యం, పప్పులు, పంచదార, బంగళాదుంపలు ఒకటేమిటి సమస్తం.

"అచ్చా! నీ పేరేమిటి?"

"అమర్ సింగ్ అహూజా."

"అచ్చా అమర్ సింగ్ ఇక వెళ్ళు"

లారీ కదిలిపోయింది. కొంతవరకు రస్తామీద, ఆ తరువాత బేరస్తా మీద. అమర్ సింగ్ లారీని అడవి దారి పట్టించి అక్కడ దూరంగా ఒక ఏటిగట్టున వున్న రెండు పూరియిళ్ళ దగ్గర ఆపాడు. సరుకులు వాటిలో పెట్టి తాళం వేశాడు. లారీ ఓ పెద్ద పూరిపాకలో కి వెళ్ళిపోయింది. పాక మీద ఆకులు తీగలు దట్టంగా వున్నాయి. అందులో వుంటే లారీ బ్రహ్మదేవుడికి కనిపించదు.

అమర్ సింగ్ అహుజా పరమ సాహసికుడు. అతను మిలిట్రీవాడు కాదు. కాని పంజాబు నుంచి తూర్పు బెంగాలొచ్చాడు. అతని వృత్తి ఘరానా దొంగతనం, మోసం. అతనికెన్నో పేర్లు, వేషాలు, ఏదీ నిజమైనది కాదు. చివరికి గడ్డం కూడా నిజమైనది కాదు."

కమల్ అతన్ని పట్టాడో, అతనే కమల్ ని పట్టాడో చెప్పలేం, కాని యిద్దరూ ఒక ఒప్పందానికొచ్చారు. కమల్ అహుజాకి రేషను ఇండెంటు ఫారాలిచ్చాడు. అతను తరచు అవి నింపి తీసుకొచ్చి, రేషన్లు తీసుకుంటాడు. రేషన్లు ఇప్పించే భారం కమల్ ది. వచ్చినప్పుడల్లా నాలుగైదు వేల రూపాయల ఖరీదు చేసే రేషన్లు కమల్ యిస్తాడు. వాటిలో సగం అమర్ సింగ్ వి, మిగతా సగం బీద ప్రజలవి. రాత్రిళ్ళు రహస్యంగా వెళ్ళి అమర్ సింగ్ సాయంతో పల్లె ప్రజలకి పంచి పెట్టేవాడు.

"నాకిది సాహసమే...." కమల్ అన్నాడు.

"నిజంగా గొప్ప సాహసం!" నేనన్నాను.

మళ్ళీ చెట్ల ఆకులు పల పలమన్నాయి. వెంటనే కమల్ టోపీ పెట్టుకున్నాడు. క్రోటన్స్ మొక్కల్ని దూసుకుని ఒక కుక్క వచ్చి మమ్మల్ని చూసి తోక ఝాడించి వెళ్ళిపోయింది. కమల్ టోపీ పక్కని పెట్టాడు... కథ కొనసాగించేడు:

"కాని అహుజాకిది సాహసం కాదు. అతని లారీ వూసరవెల్లి రంగులు మార్చినట్టు, నెంబరు, రంగు, మార్కు మారుస్తుంది.

"ఈ వ్యవహారం చాలా ప్రమాదకరమైందని నాకు తెలుసు. అయినా దీని మూలంగా గెద్దల్ని కొట్టి కాకులకేస్తున్నానన్న తృప్తి కలిగింది. కాని అది అట్టేకాలం సాగలేదు.

"ఓనాడు అహుజా లారీ సరుకుతో సహా మిలిట్రీ పోలీసులకి దొరికిపోయింది. అహుజా చాలా సాహసుడని చెప్పాను కదా. అతని దగ్గర ఎప్పుడూ పిస్తోలు, చురకత్తి గుప్తంగా వుంటాయి. ఆవేళ అతని లారీ దొరికిపోగానే, పోలీసులకి అతనికి మధ్య చిన్న యుద్ధం జరిగింది. అమర్ సింగ్ ఒక పోలీసుని పిస్తోలుతో కాల్చి చంపాడు. మీదికి వురికిన మరో పోలీసుని కత్తితో గాయం చేసి పారిపోయాడు.

"ఈ సందర్భంలో నేను బైటపడొచ్చు. అంచేత రాత్రికి రాత్రి నేనక్కణ్ణించి పరారి అయిపోయాను"

''నెలరోజులు రహస్యంగా కాలం గడిపాను. గడ్డం మీసం పెంచాను. టోపీ పెట్టాను. కరీమ్ అనే మారు పేరుతో ఆర్మీ మెడికల్ కోర్ లో సివిలియన్ క్లర్కుగా చేరా. అదీ కథ".

కథ విని నేను చాల దిగులు పడ్డా.

"కమల్, మీరు చాల జాగ్రత్తగా వుండాలి. మీ అమ్మగారు మీ కోసం చాలా బెంగ పెట్టుకొని వుంటారు."

"అమ్మ ధైర్యమైనదే. కాని పద్మ గురించి చాలా బాధగా వుంది. పద్మ ఎక్కడుందో మీకుగాని తెలుసునా?

"ఇప్పటి వరకూ తెలీదు. వాళ్ళు కొమిల్లాలో లేరు. వాళ్ళతండ్రి చనిపోయాడు. ఇల్లద్దెకిచ్చి యెక్కడికో వెళ్ళిపోయారు."

"ఓహ్! పద్మ బతికేవుందా!"

"మీకెందుకా అనుమానం కలిగింది?"

"ఏమో! నా మనసు చెడునే శంకిస్తుంది."

"అభిమానం వుంటే అలాగే అనిపిస్తుంది. కాని పద్మ కులాసాగానే వుందని నాకనిపిస్తుంది. పద్మ సంగతి నాకు తెలియగానే మీకు రాస్తా. మీ అడ్రసు?"

అతను ఢాకాలో తన అడ్రసిచ్చాడు.

వారం తరవాత నేను ఆస్పత్రి నించి విడుదలై యూనిట్ చేరాను.

## 19

నేనుతిరిగి యూనిటు చేరిన కొద్ది నెలల్లోనే బెర్లిన్ పతనం, హిట్లరు మరణం యూరోపు యుద్ధం అంతం జరిగేయి.

తూర్పురంగంలో మిత్రమండలి సేనలు జపాను సేనల్ని తరిమి కొట్టి, శత్రువులకి చిక్కిన ప్రదేశాల్ని తిరిగి వశపర్చుకుంటున్నాయి. ఈ పురోగమనం ఓ విధంగా సంతోషం కలిగిస్తున్నా తెల్లవాళ్ళు నిరుత్సాహంగా

వున్నారు. వాళ్ళలో చాలా మంది స్వదేశం వదిలి ఆరేళ్ళవుతూంది. వాళ్ళందరూ అత్మబంధువుల కోసం బెంగపడి పోయేరు. ఇళ్ళ గురించి కలలు గంటున్నారు. కొందరు వివాహానికి ముందు ప్రధానం చేసుకొని, కొందరప్పుడే వివాహం ఆడి, కొందరు భార్యలు గర్భవతులుగా వుండగా దేశం విడిచి వచ్చేరు.

"ప్రియా! మన ప్రధానం జరిగి ఆరేళ్ళు కావస్తుంది. ఎప్పుడు వస్తావు?"

"ప్రియా! మన పెళ్ళినాడు చర్చినించి తిరిగి వస్తూనే నన్నెడబాసి విదేశం వెళ్ళిపోయావు. ఐదేళ్ళు దాటుతూంది. నిన్ను తలవని పగలులేదు. కలలో చూడని రాత్రి లేదు. ఎప్పుడొస్తావు?"

"డార్లింగ్! మన బాబుని నర్సరీ బడిలో ఇవాళే చేర్చా. వాడు నిన్నెప్పుడూ చూళ్ళేదు. వాడి తో నీ గురించి యెన్నో గొప్పలు చెప్పా. నీ ఫోటోలు చూసి డాడీ ఎప్పుడొస్తాడంటున్నాడు. త్వరగా రావూ?"

"హనీ! ఆరేళ్ళయింది. నువ్వులేని నిముషమొక యుగంలా వుంది. నువ్వు పంపుతూన్న ఆహారపు పార్సెల్సు అందుతున్నాయి. కాని తింటే నోటికిపోదు, నోట్లో దినోట్లో వుంటుండగానే కన్నీళ్లు ధారాపాతంగా కారి పోతున్నాయి. హనీ! నీ కోసం యెదురుచూడని రోజులేదు. ఆరేళ్ళయిపోయింది. నీ అవసరం నాకెంతుందో ఊహించుకోగలవా? నువ్వు నాకు కావాలి. నువ్వురావాలి. రావూ? వేగంగా రా. మర్చిపోకు."

ఇలాంటివీ, యింతకన్న భయంకరమైనవి, విచిత్రమైనవి, వుత్తరాలు మా తెల్ల సోల్జర్ల కొస్తున్నాయి. అవి చదువుకుని వాళ్ళు దుఃఖించి ఏం చెయ్యలేక తప్పతాగి ఆ మైకంలో దుఃఖాన్ని మర్చిపోతున్నారు.

ఇంతలో మా యూనిటు "రాఖీ ద్వీపాల"కి పురోగమించవలసిందని తాఖీదు వచ్చింది. ఆ సాయంత్రం తెల్లవాళ్ళ మొహాలమీద కత్తి వేస్తే నెత్తురు చుక్క లేదు. ఇంటికి దగ్గిర యూరపులో యుద్ధం ముగిసింది. కాని ఇక్కడ యింటికి పదివేల మైళ్ళ దూరంలో తామున్న దగ్గిర యింకా యుద్ధం ముగియలేదు. సరికదా, ముమ్మరంగా సాగుతోంది. వాళ్ళకి కూడా యెందుకీ యుద్ధమనిపించింది. నిరాశ కలిగింది. ఏడుపొచ్చింది. గుండెమండింది. కాని యేం లాభం తాఖీదు తాఖీదే.

రాఖీ ద్వీపాలంటే అందరికీ సింహస్వప్నం. అక్కడ ఘోర యుద్ధం జరుగుతూంది. దొరికిన తెల్లవాళ్లనందర్నీ శత్రువులు పెట్రోలు వేసి కాల్చేస్తున్నారు. చెట్లకి విరిచికట్టి శిలువ వేస్తున్నారు. బాంబులు పడి ట్రెంచిల్లో వున్నవాళ్లు వున్నపాళంగా హతమైపోతున్నారు. అక్కడ ముష్టా ముష్టి యుద్ధం జరుగుతూంది.

ఒక ఉదయం అయిదుగంటలకి అందరూ పెరేడ్ గ్రౌండులో కలిసేరు. ప్రతి సోల్జర్ తను మొయ్యగలిగిన సామానే తీసుకెళ్ళాలి. మిగిలిన వన్నీ పూర్తిగా ధ్వంసం చెయ్యాలి. ఆఫీసుకి సంబంధించిన ముఖ్యమైన పది పన్నెండు ఫైళ్ళు తప్ప మిగిలినవన్నీ ధ్వంసం చెయ్యాలి.

నేను సార్జంటు మేజరుతో అన్నా

"మేజరు సాబ్? ఈ దుస్తులన్నీ ధ్వంసం చెయ్యడమెందుకూ బీదవాళ్ళకి పంచి పెడదామా"

"వీల్లేదు. ధ్వంసమంటే ధ్వంసమే. ఏదీ? నీ దగ్గరేమున్నాయి చూడ్నీ" అతను నాతో వచ్చేడు.

నా దగ్గిర స్వంతం డజను పంట్లాలు, చొక్కాలున్నాయి. రెండు డజన్ల బనీన్లున్నాయి. ఎన్నో జోళ్ళ మేజోళ్ళున్నాయి. అన్నీ సార్జంటు మేజరు ఫర్రు ఫర్రున చింపేసేడు.

"ఎందుకిలా చింపేస్తావ్?"

"ఇది యుద్ధం. నా దగ్గరున్నవి చూద్దూగాని రా...కమాన్"

అదొకవెర్రి. దానికర్థమేమిటో! అదొక కసి.ఎవరిమీదో! సామాన్య సిపాయి మొదలు ఆఫీసరు దాకా. అంతా పిచ్చెత్తినట్టు చెలరేగేరు. తనదా యింకోడిదా అనే భేదం లేకుండా కట్టుకునేది, తినేది అనే తేడా లేకుండా యూనిటంతా గాలించి ఒక పర్వతమంత సరుకు పేరేడ్ గ్రౌండులో చేర్చేరు. దాని మీద ఒక డబ్బా పెట్రోలు వేసి నిప్పంటించేరు. క్షణంలో అగ్ని ఆకాశాన్నందుకుంది. అరకాన్ రోడ్డు మీద గుమి గూడి ప్రజలీ దహనకాండ చూస్తూ నిలబడిపోయేరు. మంటలెగుస్తూంటే మా వాళ్ళంతా చేతులు చేతులు కలిపి నృత్యం చేసేరు. నృత్యం చేస్తున్న మంటలకి తాళం వేసినట్టు.

అరగంటలో లంకాదహనం పూర్తయింది.

మా దగ్గిర మిగిల్నివి కట్టుకొన్న బట్టలు, మరి మూడు డ్రస్ జతలు. కిట్ బ్యాగ్. హేవర్క్. వాటరు బాటిలు. వారం రోజులకి సరిపడ్డ రేషన్లు.

తొమ్మిదిగంటలైంది. పుణ్యకాలానికి మరోగంట వ్యవధుంది. అంతా టీకి వెళ్ళిపోయారు.

నేను ఆఫీసుకి వెళ్ళా. ఆఫీసు బావురుమంటూంది. ఓ.సీ. నల్లమందు తిన్నట్టున్నాడు.

"హవల్దార్"

నేనతని గదిలోకెళ్ళా. కూచోమన్నాడు. కూచుని అతనికో సిగరెట్టిచ్చి, నేనోటి ముట్టించా. రెండు దమ్ములాగి, సీరియస్ గా చూసీ "ఇది జీవితం" అన్నాడు, జేవురించిన మొహంతో. నేను జవాబు చెప్పలేదు. తన పర్సు నా మీదికి విసిరేడు. దాంట్లో ఫోటోవుంది. అది నేను చాలాసార్లు చూసేను. ఇప్పుడు తిరిగి చూసేను. ఆ ఫోటోలో అతని భార్య, ఐదేళ్ళ కొడుకు వున్నాడు.

"బహుశా బహుశా... నేను వీళ్ళని మరి చూళ్ళేను" ఓ.సీ. అన్నాడు. అతని కళ్ళెర్రగా వున్నాయి.

"అలా అనుకోకండి. తప్పక చూస్తారు. అచిరకాలంలో చూస్తారు. నా మనస్సాక్షి చెప్తూంది" నేనతనికి దిలాసా యిచ్చేను. అతను మొహం తీవ్రంగా పెట్టి "బహుశా" అని తిరిగి "నాకా ఆశ వుంది" అన్నాడు. నేను "తప్పక" అన్నా.

సార్జంటు మేజరొచ్చి సెల్యూట్ చేసి "అంతా సిద్ధంసర్" అన్నాడు, "ఓకే" అన్నాడు,

పదిగంటలైంది.

ఇంతలో బ్రిగేడ్ నించి కొరియరు వుత్తరం తెచ్చి ఓ.సీ.కిచ్చి వెళ్ళిపోయేడు. ఓ.సీ. కవరుచింపి చదివేడు. చదువుతూంటే అతని మొహం ఎన్నో రంగులు మారింది. చిన్ననవ్వు నవ్వేడు, అది పెరిగి పెద్దదై "అహహహ" అని ఆగకుండా "ఓ హో హో హో" అని దీర్ఘంగా "హో"ని మూలిగినట్టు అంతమైంది. అతను టేబిలు మీద అరిచేతుల్లో మొహం పెట్టుకుని మూలిగేడు. నేను సార్జంటు మేజరు మొహంకేసి చూశా. అతను నా మొహం కేసి చూసేడు. మాకేం అర్థం కాలేదు.

ఓ.సీ. నిమ్మళంగా తలెత్తేడు. మా యిద్దరివేపూ చూసేడు. "మనం కదల్డం లేదు, మూవ్ మెంటు కేన్ సెల్" అని తిరిగి ఒకటే వెర్రినవ్వు నవ్వేడు. సార్జంటు మేజరు ఆనందం పట్టలేకపోయేడు.

"సర్! నన్ను వెళ్ళనివ్వండి. అందరికీ చెప్తా..." అన్నాడు సార్జెంట్ మేజర్.

"ఒద్దు. అందర్నీ పెరేడ్ చేయించు. నేనే స్వయంగా ఈ వార్త చెప్తా. హవల్దార్! నువ్వు ఆఫీసులో వుండు, ఏమైనా అర్జంటు వార్తలు రావచ్చు. సార్జంటు మేజర్! తొందరగా వెళ్ళు. హరియప్."

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments